కార్లు ఢీ.. ట్రాఫిక్‌కు అంతరాయం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పోచారం: అన్నోజిగూడలోని డీమార్టు వద్ద సాయంత్రం ఉప్పల్‌ వైపు వెళ్తున్న కారు డివైడర్‌కు తగిలి, ఎదురుగా వస్తున్న మరో కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కార్లలో ఉన్న వ్యక్తులకు స్వల్పంగా గాయాలు కాగా.. భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



బొడ్రాయి వార్షికోత్సవం



అల్వాల్‌: మచ్చబొల్లారంలోని బొడ్రాయి మొదటి వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు బోనాలతో సీతలమ్మదేవికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



రామంతాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్‌ విభాగం సౌజన్యంతో రామంతాపూర్‌ సీనియర్‌ సిటిజన్‌ సంఘం ఆధ్వర్యంలో సిటిజన్‌ భవనంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనుభవం గల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారులచే కీళ్లవాతం చర్మరోగాలు, మూత్రంలో రాళ్లు, షుగర్‌, శ్వాసకోశ వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. సీనియర్‌ సిటిజన్‌ సంఘం అధ్యక్షుడు ఎస్‌.కపర్తీశ్వర్‌, వెంకట్‌రెడ్డి, బీఎల్‌. శ్రీనివాసులు, డాక్టర్‌ నాగరాజు, సిటిజన్‌ సంఘం ప్రతినిధులతో పాటు ఆయుర్వేద వైద్యులు డాక్టర్‌ శ్రీనివాస్‌, డాక్టర్‌ శ్రీదేవి, డాక్టర్‌ నాగరాజు, అచ్యుత్‌రావు, శ్రీధర్‌రావు తదితరులున్నారు.

బీఎస్పీ ఆవిర్భావ దినోత్సవం

మల్లాపూర్‌: బహుజన్‌ సమాజ్‌ పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం నాచారంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పారావు మాట్లాడుతూ.. కాన్షీరాం, బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ ఆలోచనలతో బహుజన సమాజ్‌ పార్టీని స్థాపించి బడుగు, బలహీనవర్గాల్లో బలాన్ని నింపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి మింద్రాల నర్సింగ్‌రావు తదితరులున్నారు.

హద్దుల నిర్ధారణకు పడిగాపులు!

- భూవిస్తీర్ణంలో వ్యత్యాసాలు.. పెరుగుతున్న హద్దుల గొడవలు
- భూ సమస్యలపై అధికమవుతున్న ఫిర్యాదులు
- సర్వే కోసం నెలల తరబడి ఎదురు చూపులు
- సిబ్బంది కొరతతో పేరుకుపోతున్న దరఖాస్తులు

భూసర్వేలో నెలకొన్న నిర్లక్ష్యం కారణంగా భూవివాదాలు అధికమవుతున్నాయి. సర్వే కోసం అవసరమైన ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదుదారులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి,సిటీబ్యూరో : మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో ల్యాండ్‌ సర్వే ఏడీ పోస్టు ఖాళీ అయి.. ఆరు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు నియామకాల్లో జాప్యం కారణంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా అధికారికి ఇన్‌చార్జ్‌ బాధ్యతలు అప్పగించటంతో దేనికి న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలు ఎదురౌతున్నాయి.

అరకొరగా సర్వేయర్లు.. స్పందించని వైనం..

అరకొరగా ఉన్న సర్వేయర్లు కూడా సకాలంలో స్పందించకపోవటంతో భూవివాదాలకు సంబంధించిన దరఖాస్తులు వందల్లో పెరుగుతున్నాయి. దీంతో పలు సంస్థలు, ప్రైవేట్‌, ప్రభుత్వ భూయాజమానుల మధ్య భూ సరిహద్దు వివాదాలు పతాక స్థాయికి చేరుతున్నాయి.

- గ్రామాలు, పురపాలక సంఘాలు, బస్తీల్లో భూవివాదాలు సకాలంలో పరిష్కారానికి నోచుకోకపోవడంతో పోలీస్‌ కేసులు, గొడవల వరకు వెళ్తున్నాయి. మరోపక్క మండల, డివిజన్‌ రెవెన్యూ కార్యాయాలతో సహా జిల్లా ల్యాండ్‌ సర్వేశాఖలో ప్రతిరోజు భూసర్వేకు సంబంధించిన దరఖాస్తులు కుప్పలు, తెప్పలుగా పేరుకుపోవడంతో వారికి తలకు మించిన భారమవుతోంది.
- రంగారెడ్డి, వికారాబాద్‌ జిల్లాల్లో సత్వర సమాచారం నిమిత్తం ప్రైవేట్‌ లైసెన్స్‌డ్‌ సర్వేయర్లతో భూసర్వే చేపట్టడం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 18 మంది సర్వేయర్లు, నలుగురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వేయర్లు ఉన్నప్పటికీ భూసరిహద్దు వివాదాల పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఘట్‌కేసర్‌,



బాలానగర్‌, శామీర్‌పేట, కీసర, మేడ్చల్‌, ఉప్పల్‌, కాప్రా, మేడిపల్లి, కూకట్‌పల్లి, దుండిగల్‌ తదితర మండలాలతో సహా పలు పురపాలకసంఘాలు, బస్తీల్లో పేరుకపోయిన భూ సరిహద్దు వివాదాలు తార్కాణంగా పేర్కొంటున్నారు.

- కొన్ని గ్రామాల్లోని భూ సరిహద్దు వివాదాలు ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీస్తున్నాయి. ప్రతి మండలంలో భూవివాదాలకు సంబంధించిన దరఖాస్తులు 40 నుంచి 50 చొప్పున వస్తుండటంతో జిల్లా పరిధిలోని 15 మండలాల పరిధిలో వందలాదిగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- కాప్రా మండలం మల్లాపూర్‌ డివిజన్‌లోని గోకుల్‌నగర్‌కు చెందిన సుబ్బారావు అనే వ్యక్తి భూసర్వే కోసం సంబంధిత ఫీజులన్నీ ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించి, జనవరిలో దరఖాస్తును కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అందజేశారు. ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోకపోగా.. ఎలాంటి సమాచారం కూడా ఇవ్వలేదు. ఇలాంటి భూసర్వేకు సంబంధించిన దరఖాస్తులు నగర జిల్లాలలో వందలాదిగా పేరుకుపోయాయి.
- ఒక్కో భూ సర్వే దరఖాస్తును 45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ ,4–5 నెలలు గడుస్తున్నా.. దస్త్రాలు ముందుకు కదలకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు భూవివాదాలపై కొన్నిసార్లు ఇరువర్గాలు స్పందించకపోవడం, పంట పొలాలు సాగులో ఉండటం, సిబ్బంది కొరత వంటి కారణాలు వల్ల భూసర్వే సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామన్న వాదనలు కూడా అధికార వర్గాల నుంచి లేకపోలేదు. ఈ జాప్యంపై అధికార యంత్రాంగం సత్వరమే స్పందించి, న్యాయం చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



పోచారం: అన్నోజిగూడలోని తన ఖాళీ ప్లాట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమిస్తున్నారని ఓ వెంచర్‌ నిర్వాహకుడు కృష్ణ ఆరోపించాడు.

ఖాళీ ప్లాట్లను ఆక్రమిస్తున్నారు..

సోమవారం ఆయన మాట్లాడుతూ.. సర్వే నెంబర్‌ 15, 47లోని ఐదెకరాల విస్తీర్ణంలో లేఅవుట్‌ చేసి ప్లాట్లను విక్రయించానన్నారు. ఇందులో తనకు ఇంకా 13 ప్లాట్లు ఉన్నాయన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు ప్రహరీ నిర్మించి కబ్జా చేస్తున్నారని వాపోయాడు. తన స్థలంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దని, కొనసాగిస్తే క్రిమినల్‌ కేసులు పెడతానని హెచ్చరించాడు.

బీరప్పకు ప్రత్యేక పూజలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని బీరప్పస్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ ప్రణీతాగౌడ్‌, జవహర్‌నగర్‌ మాజీ మేయర్‌ కావ్య, మాజీ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నేతలు తిరుమల్‌రెడ్డి, సంపత్‌యాదవ్‌, భరత్‌రెడ్డి, హరిగౌడ్‌, నరహరిరెడ్డి, భాస్కర్‌గౌడ్‌, తిరుపతిరెడ్డి, శ్రీహరిగౌడ్‌, రమేష్‌గౌడ్‌ తదితరులున్నారు.


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

అగ్నిమాపక వారోత్సవాలు జయప్రదం చేయాలి


జెండా ఆవిష్కరణతో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎస్‌ఎఫ్‌ఓ

శామీర్‌పేట్‌: అగ్నిమాపక వారోత్సవాలను జయప్రదం చేయాలని శామీర్‌పేట ఎస్‌ఎఫ్‌ఓ వెంకటరమణరెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం, తుర్కపల్లిలోని ఫైర్‌ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతీ ఏటా ఏప్రిల్‌ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామని దీనిలో భాగంగా ప్రజల్లో అగ్ని భద్రత, ప్రమాద నివారణపై అవగాహన కల్పిస్తామని వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్మారక ఊరేగింపు, అగ్నిమాపకశాఖ త్యాగాలు, సేవలు, ప్రజాభద్రత కోసం అందించే సేవల గురించి తెలియజేస్తామన్నారు.

వేతనాలు చెల్లించాలని వినూత్న నిరసన

శామీర్‌పేట్‌: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. సోమవారం అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామ పంచాయతీ కార్మికులు అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రధానరోడ్డు, బస్టాండ్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ శామీర్‌పేట ఇన్‌చార్జ్‌ కిష్టప్ప, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా 'విషు' వేడుకలు

కాప్రా: మలయాళీల నూతన సంవత్సరం విషు వేడుకలు కాప్రా డివిజన్‌ ఎల్లారెడ్డిగూడ అనురాగ్‌ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన మనదేశంలో ఈ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని స్కూల్‌ ఫౌండర్‌ డాక్టర్‌ రామ్‌ అన్నారు. ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. స్కూల్‌ డైరెక్టర్‌ బిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.




మజ్జిగ వితరణ చేస్తున్న రైతు సహకార సంఘం మాజీ డైరెక్టర్‌ సత్తిరెడ్డి

చలివేంద్రం ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని ఫ్లైఓవర్‌ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రైతు సహకార సంఘం మాజీ డైరెక్టర్‌ సత్తిరెడ్డి ప్రారంభించారు. సోమవారం ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ సాయిరెడ్డి, నాయకులు కేఎం రెడ్డి, శ్రీధర్‌గౌడ్‌, సంతోష్‌నాయక్‌, వేణుమాధవ్‌, రాఘవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

కీసరగుట్టలో అన్నప్రసాద వితరణ

కీసర: కీసరగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో అందజేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. రుద్రాభిషేకం అనంతరం పల్లకిసేవలో పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ పాదయాత్ర



మేడ్చల్‌: కాంగ్రెస్‌ పార్టీ చేపట్టిన జైభీమ్‌, జై బాపు, జై సంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్‌ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌ నేతలు పాదయాత్ర నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తోటకూర వజ్రేష్‌యాదవ్‌లు నాయకులతో కలిసి పట్టణంలో పాదయాత్ర చేశారు. తహసీల్దార్‌ కార్యాలయ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం వరకు పాదయాత్ర ప్రధాన వీధుల మీదుగా నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్‌ దీపికానర్సింహ్మారెడ్డి, మల్లేష్‌గౌడ్‌, చాపరాజు, సత్యనారాయణ ఉన్నారు.

'వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ అప్రజాస్వామికం'

ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ కార్యదర్శి కాలేషా

జవహర్‌నగర్‌: కార్పొరేషన్‌ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం కమిటీ కార్యదర్శి కాలేషా మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ రూపొందించిన రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణల పేరుతో రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని ఆరోపించారు. సామాన్య పేద ముస్లింలు, మహిళలకు ఉపయోగపడేలా చట్ట సవరణ చేశామని నమ్మించేలా కట్టుకథలు చెబుతోందన్నారు. భారత రాజ్యాంగం అన్ని మతాల స్వేచ్ఛ, సమానత్వాన్ని కల్పిస్తుందన్నారు. అనంతరం అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మహ్మద్‌ మోహినుద్దీన్‌, ఇప్తా షేక్‌ షావలీ, ముస్లిం కమిటీసభ్యులు వహీద్‌, ముర్తుజా, అజ్మతుల్లా హైదర్‌, దౌలత్‌బేగం, ఇస్లామ్‌, నసీమ్‌, అంజూమ్‌, మన్సూర్‌, ఫరీదా, ఖైరూన్‌, రుక్సానా, హసీనా, సాజీద్‌, రజియాబేగం తదితరులున్నారు.


దేవేందర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

కీసర: కాంగ్రెస్‌ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆరోపించారు. సోమవారం చీర్యాలకు చెందిన కాంగ్రెస్‌ నేతలు బండారి మధుయాదవ్‌, బండారి భాస్కర్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో సుమారు 20 మంది కాంగ్రెస్‌ నేతలను ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మాజీ జెడ్పీ వైస్‌ చైర్మన్‌ వెంకటేష్‌, శ్రీనివాస్‌, రాంరెడ్డి, రాము, మల్లారపు మురళీగౌడ్‌, కిరణ్‌గౌడ్‌, శ్రీశైలం, కిషన్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలలో నూకలు !

నన్న బియ్యం పంపిణీపై పెదవివిరుస్తున్న లబ్ధిదారులు



మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఇలా...	
రేషన్‌ దుకాణాలు	619
రేషన్‌ కార్డులు	5,23,938
లబ్ధిదారులు	17,18,351
పంపిణీ	10640.052 మెట్రిక్‌ టన్నులు

సాక్షి,సిటీబ్యూరో: బియ్యం అక్రమ రవాణా దందాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. మొదట్లో బియ్యం కోటా దుకాణాలకు ఆలస్యంగా అందగా.. రెండో విడతలో సరఫరా అయ్యాయి. సన్నబియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు ఉత్సాహంగా తీసుకెళ్తున్నారు. కానీ బియ్యంలో నూక ఉంటోందని వాపోతున్నారు.

100 శాతం పంపిణీ..

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాలు, 13 పురపాలికల్లో 619 రేషన్‌ దుకాణాలు ఉన్నాయి. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాగా.. జిల్లాకు పక్కనున్న నిజామాబాద్‌, కామారెడ్డి, కరీంనగర్‌, పెద్దపల్లి జిల్లాల నుంచి బియ్యం రేషన్‌ దుకాణాలకు చేరుకున్నాయి. దీంతో రెండు విడతలుగా ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల నుంచి సరఫరా అయ్యాయి. ఇప్పటి వరకు జిల్లాలో 100 శాతం సన్న బియ్యం పంపిణీ పూర్తైంది. పరిశ్రమల కేంద్రంగా పేరున్న మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వలస కుటుంబాలు అధికంగా ఉండడంతో పోర్టబిలిటీ ద్వారా ఇక్కడే రేషన్‌ బియ్యాన్ని పొందుతున్నారు.

అధికంగా రావడంతో..

సన్న బియ్యంలో నూకలు అధికంగా ఉన్నాయి. ఘట్కేసర్‌ మండలంలోని పోచారం, ఘట్కేసర్‌ పురపాలక సంఘాల పరిధిలోని చౌక దుకాణాల ద్వారా పంపిణీ అయిన సన్న బియ్యంలో 25 శాతం వరకు నూకలు ఉన్నాయని, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదాం నుంచి కోత..

రేషన్‌ దుకాణాలకు పంపిణీ చేసే బియ్యం బస్తా (సంచి) 50 కిలోలు ఉండాలి. కానీ గోదాం నుంచి సరఫరా చేసే సమయంలో సక్రమంగా తూకం వేయకపోవడంతో 48నుంచి 49 కిలోల వరకు వస్తోందని చెబుతున్నారు.

- జిల్లాలోని మేడ్చల్‌, గుండ్ల పోచంపల్లి, తూముకుంట, పోచారం, దమ్మాయిగూడ, దుండిగల్‌, కొంపెల్లి, ఘట్కేసర్‌, బోడుప్పల్‌, జవహర్‌నగర్‌, పీర్జాదిగూడ పురపాలక సంఘాలతో సహా జీహెచ్‌ఎంసీ పరిధిలో పలు మున్సిపల్‌ సర్కిళ్లలో వలస కుటుంబాలు ఉండటంతో అదనపు కోటా కేటాయించాలని డీలర్లు కోరుతున్నారు. గతంలో బియ్యం తీసుకోని వారు కూడా సన్నబియ్యం పంపిణీ చేయడంతో తీసుకుంటున్నారు.

అర కిలో వరకు..

రెండోసారి పంపిణీ చేసిన బియ్యంలో నూకలు అధికంగా ఉన్నాయని లబ్ధిదారులు అంటున్నారు. 2 కిలోల బియ్యాన్ని జల్లెడ పడితే సుమారు అరకిలో వరకు నూకలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

డీలర్ల నుంచి డిమాండ్‌ అధికంగా ఉంది

రేషన్‌ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ సజావుగా సాగుతోంది. అన్ని దుకాణాలకు సరఫరా జరగగా.. పంపిణీ ప్రక్రియ 100 శాతం పూర్తయింది. నిజామాబాద్‌, కామారెడ్డి, కరీంనగర్‌, పెద్దపల్లి జిల్లాల నుంచి సన్నబియ్యం జిల్లాకు తరలించాం. ఇవే బియ్యాన్ని రేషన్‌ దుకాణాల ద్వారా పంపిణీ చేశాం. వలస కుటుంబాలు ఎక్కువగా ఉండటం వల్ల బియ్యం కోటాకు డీలర్ల నుంచి డిమాండ్‌ అధికంగా ఉంది.

– సుగుణబాయి, ఇన్‌చార్జి డీఎస్‌ఓ, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా

అంబేడ్కర్‌ కలలు కన్న సమాజాన్ని నిర్మిద్దాం


కీసరలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘనంగా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతి

మేడ్చల్‌ జోన్‌ పరిధిలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్‌ డాక్టర్‌ బీఆర్‌. అంబేడ్కర్‌ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన చిత్రపటం, విగ్రహాలకు వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్‌ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని పలువురు నాయకులు సూచించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. – మేడ్చల్‌ జోన్‌ బృందం


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య


టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌


రాంపల్లిలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు


జవహర్‌నగర్‌లో డీఐ శ్రీనివాస్‌, ఎస్సై రాముునాయక్‌


మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మేయర్‌ కావ్య


అన్నోజిగూడలో మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి


మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు


గౌడవెళ్లిలో..